సాక్షి
కుమురంభీం

బుధవారం : 3 : జనవరి : 2024



రేషన్ అక్రమదందాకు చెక్

రేషన్ బియ్యం చాలా వరకు పక్కదారి పడుతోంది. డీలర్లు, దళారులు ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. 8లో▸



సూత్రధారిపై వేటు!

కలెక్టరేట్‌లో ముగ్గురు సీసీలను తొలగించినట్లు తెలిసింది. అలాగే వీరి నియామకాల్లో చక్రం తిప్పిన కలెక్టరేట్ అధికారిపైనా బదిలీ వేటు పడినట్లు సమాచారం. 10లో▸

గరిష్టం/కనిష్టం
28.5 /15.6

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది. వేకువ జామున పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'ప్రజాపాలన'కు 37,019 దరఖాస్తులు

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి స్పందన లభిస్తోంది. సంక్షేమ పథకాల కోసం ప్రజలు పోటీపడి దరఖాస్తు చేసుకుంటున్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో 37,019 దరఖాస్తులు వచ్చాయి. దీంతో మొత్తం దరఖాస్తుల సంఖ్య 80,392కు చేరినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే ఒక ప్రకటనలో వెల్లడించారు. మంగళవారం ఇతర దరఖాస్తులు 4155 రాగా.. మొత్తం వీటి సంఖ్య 5034కు చేరింది.

పనుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

తిర్యాణి(ఆసిఫాబాద్): ఉపాధిహామీ పనుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో సురేందర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై మంగళవారం 13వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022- 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని 29 పంచాయతీల్లో రూ.3.63 కోట్ల విలువైన 448 పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన సంబంధిత సిబ్బందిపై రూ.62,500 జరిమానా విధించడంతోపాటు మరో రూ.46,700 రికవరీ కోసం అధికారులను ఆదేశించారు. అర్హులైన వారికి పని కల్పించడంతోపాటు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పని ప్రదేశంలో సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి కృష్ణమూర్తి, ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



దరఖాస్తు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని ఈదులవాడలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ముందుగానే దరఖాస్తులు నింపి స్వీకరణ కౌంటర్లలో అందజేయాలని సూచించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ప్రజాపాలన దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, ప్రజలెవరూ బయట దరఖాస్తు ఫారాలు కొనొద్దని సూచించారు. ఇంటి యజమాని ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లు ఉంటే సరిపోతాయని స్పష్టం చేశారు. ఈ నెల 6వరకు కొనసాగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, ఎంపీడీవో శశికళ, సర్పంచ్ భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగ ఘనంగా జరుపుకోవాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల(సిర్పూర్): జిల్లాలోని ఆదివాసీ కొలావార్(మన్నెవార్)లు 23వ భీమదేవర జెండా పండుగ, కొలావార్(మన్నెవార్) ఆత్మగౌరవ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మెర్పల్లి బ్రహ్మయ్య అన్నారు. మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనం ఆవరణలో మంగళవారం భీమదేవర జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. ఈ నెల 8న జెండా పండుగ జరుపుకోవాలని సూచించారు. కౌటాల మండల కేంద్రంలో ఉదయం 11 గంటలకు జెండా పండుగ నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.పోశం, అధికారి ప్రతినిధి మెర్పల్లి సదాశివ్, మండల అధ్యక్షుడు ఎడ్ల భీమయ్య, నాయకులు హనుమంతు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పిని వేటాడిన నిందితులతో అటవీశాఖ అధికారులు(ఫైల్)



ఆగని వేట!

- వేటగాళ్ల ఉచ్చులకు వన్యప్రాణులు హతం
- విద్యుత్ తీగలతో మనుషుల ప్రాణాలకూ ముప్పు..
- అధికారులు అవగాహన కల్పిస్తున్నా మారని తీరు
- అడ్డుకట్ట వేయలేకపోతున్న అటవీశాఖ

సిర్పూర్(టి): జిల్లాలో వన్యప్రాణుల వేటకు అడ్డుకట్ట పడటం లేదు. అటవీశాఖ అధికారుల కళ్లు కప్పి నిత్యం ఏదో ఒకచోట అటవీ జంతువులు వేటగాళ్ల ఉచ్చులకు బలవుతున్నాయి. రాత్రి సమయాల్లో విద్యుత్ తీగలతో ఉచ్చులు ఏర్పాటు చేసి దుప్పులు, జింకలు, కుందేళ్లు, కొండగొర్రెలు, తదితర వాటిని హతమారుస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వేటగాళ్లు అడపాదడపా పట్టుబడుతున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదు. అధికారులు కేసులు నమోదు చేయడం, జరిమానా విధించడం, నిందితులను రిమాండ్‌కు తరలించడం పరిపాటిగా మారింది.

అధికారుల కళ్లు కప్పి..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో విస్తృతమైన అటవీ సంపద ఉంది. జీవ నదులు ఉండటంతో అరుదైన జంతుజాలం ఇక్కడ మనుగడ సాగిస్తోంది. ముఖ్యంగా పెద్ద పులులు స్థిర నివాసం ఏర్పర్చుకున్న కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో గత కొన్నేళ్లుగా శాఖాహార జంతువుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అటవీశాఖ అధికారులు కూడా పులులకు ఆహార కొరత లేకుండా ఉండేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, బెజ్జూర్, ఆసిఫాబాద్ డివిజన్‌లో తిర్యాణి, కెరమెరి తదితర మండలాల్లో వన్యప్రాణుల వేట గుట్టుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అటవీశాఖ అధికారుల కళ్లు కప్పి వేటగాళ్లు వన్యప్రాణులను హతమారుస్తున్నారు. వేటగాళ్లు మాంసాన్ని గ్రామాల్లో విక్రయించే క్రమంలో ఏర్పడే వివాదాలు, విద్యుత్ కంచెలతో జరిగే ప్రమాదాలతోనే ఘటనలు బయటికి వస్తున్నాయి తప్ప.. అధికారులు వేటను అరికట్టలేకపోతున్నారు. దీంతో వారు వేట అనంతరం నిందితులపై కేవలం కేసుల నమోదుకే పరిమితమవుతున్నారనే అపవాదు ఉంది.

సమీప గ్రామాల్లో అధికం..!

జిల్లాలోని అటవీ ప్రాంతాలను ఆనుకునే అనేక గ్రామాలు ఉన్నాయి. పంట చేలు పూర్తిగా అడవుల్లోనే ఉంటాయి. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో వన్యప్రాణుల వేట అధికంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే పంటలను అడవి పందులు, ఇతర జంతువుల నుంచి రక్షించుకునేందుకు రైతులు వివిధ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విద్యుత్ తీగలు అమర్చడం, పురుగు మందులతో అటవీ జంతువుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. వన్యప్రాణుల వేట, పంట రక్షణ కోసం ఏర్పాటు చేసే విద్యుత్ వైర్లకు తగిలి గతంలో జిల్లాలో పలువురు మృత్యువాత పడ్డారు. సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని చింతకుంట గ్రామానికి చెందిన లావుడే మహేష్ నాయక్ అనే యువకుడు ఇలాగే విద్యుత్ తీగలు మృత్యువాత పడ్డాడు.

కఠిన చర్యలు తీసుకుంటాం

వన్యప్రాణుల వేటను కట్టడి చేసేందుకు అడవుల సమీపంలోని గ్రామాల్లో పెట్రోలింగ్ పెంచుతాం. ఇన్‌ఫార్మర్ వ్యవస్థను పటిష్టం చేసి వేటగాళ్లను నిలువరిస్తాం. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– వేణుబాబు, ఎఫ్‌డీవో, కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ డివిజన్‌లో కేసులు

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కాగజ్‌నగర్, పెంచికల్‌పేట్, బెజ్జూర్, కర్జెల్లి, సిర్పూర్(టి) రేంజ్‌ల పరిధిలో 2023లో మొత్తం 14 కేసులు నమోదయ్యాయి. ఈ 14 కేసుల్లో మొత్తం 49 మందిని రిమాండ్‌కు తరలించారు. ఇవే కాకుండా మరికొన్ని కేసుల్లో పలువురికి జరిమానాలు విధించారు. ఒక్క సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోనే ఆరు కేసులు నమోదయ్యాయి. భూపాలపట్నం గ్రామంలో ఒక కేసు నమోదు కాగా జరిమానా విధించారు. డిసెంబర్ 28న 31 మందిపై కేసు నమోదు చేశారు. 15 మంది మాంసం విక్రయదారులు, కొనుగోలు దారులు, వేటగాళ్లను రిమాండ్‌కు తరలించారు. గతేడాది మరో నాలుగు కేసుల్లో మహారాష్ట్ర నుంచి మాంసం తరలిస్తున్న పలువురి పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

విస్తృతంగా అవగాహన

జిల్లాలో పెద్ద పులుల సంచారం ఉండటంతో అటవీశాఖ అధికారులు నిత్యం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పులి, వన్యప్రాణుల సంరక్షణ ఆవశ్యకత గురించి ప్రజలకు వివరిస్తున్నారు. అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. చట్టాలు కఠినంగా ఉండటంతో వన్యప్రాణులను వేటాడి జీవితాలు నాశనం చేసుకోవద్దని వారు సూచిస్తున్నారు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



రోళ్లపాడులో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. మండలంలోని రోళ్లపాడులో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ప్రజాపాలన ద్వారా సంక్షేమ ఫలాలు అందించేందుకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. అర్హులు ముందుగా దరఖాస్తు నింపి కౌంటర్లలో అందించాలని, దరఖాస్తుదారులు నిజమైన సమాచారాన్ని మాత్రమే ఫారంలో పొందుపర్చాలని సూచించారు. తద్వారా అర్హత గల లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని అన్నారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. జిల్లాలో 1,335 కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం రశీదులు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో మంజుల, డిప్యూటీ తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీటీసీ సంఘం శ్రీనివాస్, సర్పంచ్ మంజలి హన్మక్క, ఏపీఎం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి- పెద్దబండ మధ్యలో ఉన్న రైల్వే వంతెన నిర్మాణం నత్తనడకన సాగుతుందని, నియోజకవర్గ కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం పూర్తి కాలేదని.. వీటితోపాటు ఇతర పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావుతో కలిసి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చునార్కర్ సువర్ణ, జెడ్పీటీసీ నీరటి రేఖ, సర్పంచ్ తఫీమా పర్వీన్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, డీఎల్‌పీవో సురేశ్‌బాబు, ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, మంగీలాల్, ఎంపీడీవో రాజేశ్వర్, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ప్రిన్సిపాళ్లను తొలగించాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో అవుట్‌సోర్సింగ్ విధానంలో ప్రిన్సిపాళ్లుగా కొనసాగుతున్న వారిని తొలగించాలని డీవైఎఫ్‌ఐ, కేవీపీఎస్, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడేను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకులాల్లో రెగ్యులర్ జూనియర్ అధ్యాపకులు ఉండగా, పొరుగు సేవల పద్ధతిలో ప్రిన్సిపాళ్లను అక్రమంగా నియమించారని ఆరోపించారు. ఓ ప్రైవేట్ స్కూల్ యజమాని, ప్రభుత్వ టీచర్లుగా రిటైర్మెంట్ అయిన వారు ప్రస్తుతం కాగజ్‌నగర్‌లోని మైనార్టీ, జ్యోతిబా పూలే గురుకులంలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలపై అనుభవం లేని వారిని నియమించడం సరికాదని, వెంటనే వారిని తొలగించాలని డిమాండ్ చేశారు. నాయకులు కార్తీక్, దినకర్, రమేశ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ 'కిక్కు'

- మూడు రోజుల్లో రూ.4.12 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు
- సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు విక్రయాలు
- అదేదారిలో మాంసం, ఇతర వ్యాపారాలు

ఆసిఫాబాద్: మద్యం విక్రయాల్లో న్యూ ఇయర్ జోష్ కనిపించింది. 2023కు జిల్లా ప్రజలు ఘనంగా వీడ్కోలు పలుకుతూ.. నూతన సంవత్సరానికి స్వాగతిస్తూ సంబురాల్లో మునిగితేలారు. న్యూ ఇయర్ సందర్భంగా మద్యం, మాంసం అమ్మకాలు జోరుగా సాగాయి. మాములు రోజులతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో విక్రయాలు జరగడం విశేషం. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలు అర్ధరాత్రి ఒంటి గంట వరకు అనుమతినిచ్చిన విషయం తెలిసిందే. డిసెంబర్ 31న ఆదివారం కూడా కలిసి రావడంతో సంబురాలు అంబరాన్నంటాయి.

డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో మద్యం విక్రయాలు

సంవత్సరం	ఐఎంఎల్ కేస్‌లు	బీర్ల కేస్‌లు	ఆదాయం
2022	4690	4115	4,15,78,834
2023	4969	4010	4,12,03,419

32 మద్యం దుకాణాలు..

డిసెంబర్ 29, 30, 31 తేదీల్లో హోటళ్లు, బార్లలో ఉదయం నుంచి రాత్రి వరకు రికార్డు స్థాయిలో అమ్మకాలు సాగాయి. 31న అయితే యువతతోపాటు అన్ని వర్గాల ప్రజలు పార్టీలు జరుపుకొనేందుకు ఉత్సాహం చూపారు. సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని 32 మద్యం దుకాణాల్లో డిసెంబర్ చివరి మూడు రోజుల్లో రూ.4,12,03,419 విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. గతేడాది ఆయా రోజుల్లో రూ.4,15,78,834 విలువైన మద్యం అమ్మకాలు సాగాయి. గతేడాదితో పోలిస్తే స్వల్పంగా తగ్గినా దాదాపు అదే స్థాయిలో విక్రయాలు జరిగాయి. దీంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం సమకూరింది. ఈ ఏడాది డిసెంబర్‌లో చివరి మూడు రోజుల్లో జిల్లాలో 4969 ఐఎంఎల్ లిక్కర్ కేస్‌లు, 4010 బీర్ల కేస్‌ల అమ్మకాలు జరిగాయి.



ఊపందుకున్న మాంసం విక్రయాలు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మద్యంతోపాటు మాంసం విక్రయాలు ఊపందుకున్నాయి. జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్ మున్సిపాలిటీతోపాటు అన్ని మండలాల్లో చికెన్, మటన్, చేపల విక్రయాలు భారీగా జరిగాయి. రూ.లక్షల్లో మాంసం అమ్మకాలు జరిగాయి. ముఖ్యంగా ఈ ఏడాది చివరి రోజు ఆదివారం కలిసి రావడంతో అన్నివర్గాల ప్రజలు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యాటక ప్రాంతాలతో పాటు నివాస ప్రాంతాల్లో యువత, మహిళలు సైతం వేడుకలు జరుపుకొన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా కేక్‌లు, స్వీట్ల విక్రయాలు భారీగా జరిగాయి. మామూలు రోజుల్లో స్థానికంగా తయారైన కేకులు విక్రయిస్తుండగా న్యూఇయర్ వేడుకల కోసం మంచిర్యాల, కరీంనగర్‌కు చెందిన కొన్ని కంపనీలు ప్రత్యేక కేక్‌లు తయారు చేసి మండలాల వారీగా రిటైల్ దుకాణాలకు సరఫరా చేశాయి. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కేక్‌ల దుకాణాలు వెలిశాయి. ప్రత్యేక టెంట్లు వేసి స్టాళ్లు ఏర్పాటు చేశారు. కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు వివిధ రకాల ఆకర్షనీయమైన కేకులు అందుబాటులో ఉంచారు. ఒక్కో కేక్ కనీసం రూ.100 నుంచి 500 వరకు విక్రయించగా, కిలో స్వీట్ రూ.400 నుంచి రూ.500 వరకు విక్రయించారు. నలుగురు కలిస్తే చాలు.. ఒక కేక్ అనే రీతిలో అమ్మకాలు సాగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. స్వీట్ హౌజ్‌లు, బేకరీలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ఫీజు కట్టలేక.. చదువు ప్రశ్నార్థకం

- పేద వైద్య విద్యార్థినికి చేయూత కరువు
- సెమిస్టర్ ఫీజులు చెల్లించలేక సతమతం
- ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్న కరీష్మా
- దాతలు ఆదుకోవాలని వేడుకోలు



కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థిని కరీష్మా

కౌటాల(సిర్పూర్): మారుమూల పల్లెకు చెందిన నిరుపేద చదువుల తల్లిని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. దాతల సాయం కోసం ఎదురు చూస్తుంది. కౌటాల మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన గుడ్లబోరికి చెందిన చహరే జనార్దన్, రేఖాబాయి దంపతుల కుమార్తె కరీష్మా 2021లో నీట్ రాసి 417 మార్కులతో 1,11,479 ర్యాంకు సాధించింది. 2022 ఫిబ్రవరి 5న హైదరాబాద్‌లోని అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, రీసెర్చ్‌లో ఎంబీబీఎస్ సీటు పొందింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా కాలేజీలో చేరేందుకు అడ్మిషన్ ఫీజులు చెల్లించేందుకు పడుతున్న ఇబ్బందులను అప్పుడు 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ప్రజాప్రతినిధులు, పలువురు దాతలు స్పందించి సాయమందించడంతో కళాశాలలో చేరింది.

నిరుపేద కుటుంబం..

ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న చహరే జనార్దన్, రేఖాబాయి దంపతులకు సచిన్, దీక్ష, కరీష్మా ముగ్గురు సంతానం. జనార్దన్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. రేఖాబాయి రూ.4 లక్షల వరకు అప్పు చేసి అతడికి ఆపరేషన్ కూడా చేయించింది. ప్రస్తుతం కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు సచిన్‌కు వివాహం కాగా.. పెద్ద కుమార్తె దీక్ష బీఈడీ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది.

సెమిస్టర్ ఫీజు రూ.2.42 లక్షలు

కరీష్మా స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు, సిర్పూర్(టి)లోని గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. పదో తరగతి వార్షిక పరీక్షల్లో 9.5 పాయింట్లు సాధించింది. సీఓఈ కరీంనగర్ సీటు పొంది అక్కడే 942 మార్కులతో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. అనంతరం దాతల సాయంతో ఎంబీబీఎస్‌లో చేరింది. ప్రస్తుతం సెకండియర్ చదువుతున్న కరీష్మాకు ఫిబ్రవరిలో సెమిస్టర్ పరీక్షలు ఉన్నాయి. సెమిస్టర్ ఫీజు రూ.2.42 లక్షలు ఈ నెల 15లోగా చెల్లించాలని కళాశాల యాజమాన్యం చెప్పడంతో ఆందోళన చెందుతోంది. ఇలాంటి దయనీయస్థితిలో కరిష్మా ఎంబీబీఎస్ పూర్తి చేయాలంటే ఏడాదికి రూ.1.50లక్షల ఖర్చవుతుందని అంచనా. పుస్తకాలు, రికార్డులు, పరికరాలకు అదనంగా రూ.50 వేల వరకు ఖర్చవుతుంది. కోర్సు పూర్తయ్యే వరకు సుమారు రూ.12 లక్షల వరకు ఖర్చవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. 'పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించా.. చదువుకు ఆర్థికంగా సహకరించే వారికి రుణపడి ఉంటా.. డాక్టర్‌గా పేదలకు సేవ చేయాలన్నదే తన లక్ష్యం. దాతలు స్పందించి ఆదుకోవాలి.' అని కరీష్మా వేడుకుంటోంది.

సాయం చేయాల్సిన నంబర్లు

బ్యాంక్ అకౌంట్ నంబర్ :
40833814222

ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : SBIN 0061739

ఫోన్‌పే, గూగుల్ పే నంబర్ :
9381829476

దాతలు ఆదుకోవాలి



తన బిడ్డ డాక్టర్ చదువుకు పేదరికం అడ్డొస్తుంది. భార్య కూలీ పని చేస్తేనే కుటుంబం గడుస్తోంది. బిడ్డ చదువుకు ఫీజు ఎలా చెల్లించాలో తెలియడం లేదు. ప్రజాప్రతినిధులు, దాతలు ఎవరైనా ఆదుకుంటే జీవితాంతం రుణపడి ఉంటాం.

– చహరే జనార్దన్, కరీష్మా తండ్రి

బంకుల వద్ద రద్దీ

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా లారీలు, ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు మంగళవారం ఆందోళనలు చేపటటారు. దీంతో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందని ప్రచారం జరగడంతో జిల్లా కేంద్రంతోపాటు పలు ప్రాంతాల్లోని పెట్రోల్ బంక్‌లకు వాహనదారులు పోటెత్తారు. కొన్ని బంకుల ఎదుట నో స్టాక్ బోర్డులు సైతం దర్శనమిచ్చాయి.

జిల్లా కేంద్రంలో బారులు తీరిన వాహనదారులు



క్లుప్తంగా

మేకల మందపై చిరుతపులి దాడి

కోటపల్లి: మండలంలోని పిన్నారం అటవీ ప్రాంతంలో మేకల మందపై చిరుతపులి దాడి చేసి మేకపిల్లను గాయపర్చింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కాపరి గడ్డం అంకయ్య మంగళవారం మేకలను తోలుకుని శివారులోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. చిరుతపులి ఒక్కసారిగా మందపై దాడి చేసి మేకపిల్లను గాయపర్చింది. అంకయ్య గట్టిగా కేకలు వేయడంతో చిరుత పారిపోయింది. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. చిరుత సంచారంపై ఫారెస్టు అధికారులు నిఘా ఉంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

తిర్యాణి: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రం శివారులోని పాత సమ్మక్క గద్దెల ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా మండలంలోని గుడిపేట గ్రామానికి చెందిన కోట్నాక గణపతి, గిన్నెదరి గ్రామానికి చెందిన మడావి బోజ్జిరావు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారి వద్ద తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి దొరికింది. ఈ మేరకు డెప్యూటీ తహసీల్దార్ వంశీకృష్ణ సమక్షంలో పంచనామా నిర్వహించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో సీఐటీయూ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మైనింగ్ సిబ్బంది

శ్రీరాంపూర్: మందమర్రి ఏరియాలోని కేకే 5 గని ఓవర్‌మెన్ టీ.చంద్రశేఖర్‌ను అక్రమంగా బదిలీ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్కే 7 గనిపై మైనింగ్ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బదిలీని రద్దు చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బాలాజీ, పిట్ సెక్రెటరీ శ్రీధర్, నాయకులు అనిల్, రాకేశ్, ప్రవీణ్, భగవాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చలిమంటలు అంటుకుని వివాహిత మృతి

తిర్యాణి: చలి కాగేందుకు వేసుకున్న మంటలు అంటుకుని వివాహిత మృతి చెందిన సంఘటన మండలంలోని సాలేగూడలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గిన్నెదరి పంచాయతీ పరిధిలోని సాలేగూడకు చెందిన దేవేంద్ర (31)కు ఆర్నెళ్ల క్రితం గుండాలకు చెందిన కుడిమెత నాగేశ్‌తో వివాహమైంది. రెండు నెలలుగా దేవేంద్ర అనారోగ్యంతో బాధపడుతుండడంతో పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం ఇంటిముందు చలిమంట కాగుతుండగా ప్రమాదశాత్తు ఆమె నైటీకి మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి మర్సుకోల శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ అక్రమ దందాకు చెక్



దండేపల్లి మండలం లింగాపూర్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

- అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- ఐపీఎస్ అధికారికి పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు
- అక్రమ రవాణాదారులపై పీడీయాక్ట్

మంచిర్యాలక్రైం: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ఆకలి తీర్చేందుకు పౌర సరఫరాల శాఖ ద్వారా ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. తినడానికి యోగ్యంగా లేకపోవడంతో వాటిని అధిక ధరలకు అమ్ముకుని సన్నబియ్యం కొనుగోలు చేసుకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన దళారులు, కొందరు రేషన్ డీలర్లు సైతం లబ్ధిదారుల నుంచి బియ్యం తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు, రైస్‌మిల్లులకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రైస్ మిల్లర్ల యజమానులు అట్టి బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి సీఎంఆర్‌గా సరఫరా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ దందా రాష్ట్ర వ్యాప్తంగా యథేచ్ఛగా సాగుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ బియ్యం అక్రమ దందాకు చెక్ పెట్టేందుకు శ్రీకారం చుట్టింది.

అట్నుంచి అటే...

గతంలో దళారులు ఇంటింటా తిరుగుతూ కిలోకు రూ.8 నుంచి రూ.10 వరకు వెచ్చించి రేషన్ బియ్యం కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం రేషన్ డీలర్లు సైతం బియ్యం కొనుగోలు చేయడం ప్రారంభించారు. దీంతో లబ్ధిదారులు బియ్యాన్ని ఇంటివరకు తెచ్చుకోకుండా అట్నుంచి అటే రేషన్ డీలర్లకు అమ్మేస్తున్నారు. దీంతో రేషన్ డీలర్లు అనధికార నగదు బదిలీ దందాకు తెరలేపారు. రేషన్ దుకాణం తెరవగానే లబ్ధిదారులు వెళ్లి వేలిముద్రలు వేయడం.. నగదు తీసుకుని ఇంటికి రావడం పరిపాటిగా మారింది. కొంతమంది దళారులు రేషన్ షాపుల వద్దే పడిగాపులు కాస్తూ లబ్ధిదారుల నుంచి బియ్యం కొనేందుకు పోటీపడుతున్నారు. ఈ తతంగంపై పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంపై సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి...

రేషన్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు గతంలో ఎఫ్‌సీఐలో పనిచేసిన అనుభవం ఉన్న ఐపీఎస్ సీనియర్ పోలీస్ అధికారి డీఎస్.చౌహాన్‌ను పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. పీడీఎస్ రైస్ అక్రమ రవాణకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక కార్యాచరణ తయారు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇక పేదల బియ్యం పక్కదారి పట్టకుండా బ్రేక్ పడనుంది.

అక్రమ రవాణా ఇలా...

రేషన్ బియ్యం సేకరించిన వ్యాపారులు, కొంతమంది రేషన్ డీలర్లు సైతం ఆటోలు, డీసీఎంలు, లారీల్లో రేషన్ బియ్యాన్ని మంచిర్యాల నుంచి మహారాష్ట్రకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. గతంలో రైలుమార్గం గుండా భాగ్యనగర్, నాగ్‌పూర్ ప్యాసింజర్ రైళ్లో రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రలోని వీరుర్‌కు తరలించేవారు. ప్రస్తుతం మహారాష్ట్రలోని సిరొంచాకు తరలిస్తున్నారు. జ గ్దాల్‌పూర్ నేషనల్ హైవే మార్గంలో సిరొంచా స మీపంలో గోదావరినదిపై కాళేశ్వరం బ్రిడ్జి నిర్మించడంతో రాత్రి, పగలు తేడాలేకుండా యథేచ్ఛగా బియ్యం తరలిస్తున్నారు. కాళేశ్వరం బ్రిడ్జి సమీ పంలో అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినా అ క్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు మాములుగా తీసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

అక్రమ రవాణాదారులపై పీడీయాక్ట్



రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తాం. రేషన్ అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక పోలీస్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. కమిషనరేట్ పరిధిలో ఎవరైనా అక్రమ రవాణాకు పాల్పడితే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలి.

– రెమా రాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

నిలిచిన పాదయాత్రలు..



నస్పూర్ కాలనీలో కూలిన డ్రెయినేజీ

- మూగబోయిన 'డయల్ యువర్ జీఎం'
- అపరిష్కృతంగా కాలనీ సమస్యలు
- కొత్త గుర్తింపు సంఘమైనా చొరవ చూపేనా?

శ్రీరాంపూర్: కాలనీల్లో నివాసం ఉంటున్న కార్మిక కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన జీఎం పాదయాత్రలు మూడేళ్లుగా నిలిచిపోయాయి. కంపెనీలోని అతిపెద్ద ఏరియా అయిన శ్రీరాంపూర్‌తో పాటు అన్ని ఏరియాల్లో పాదయాత్రలు నిర్వహించడంలేదు. కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు పదిహేనేళ్ల క్రితం పాదయాత్రల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కానీ కరోనాకు కొన్ని నెలల ముందే వాటిని నిలిపివేశారు. దీంతో కాలనీల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం కార్మికులు ఉంటున్న క్వార్టర్లు ఏళ్లక్రితం నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షం కురిస్తే పైకప్పు ఉరుస్తోంది. తలుపులు, కిటికీలు ఊడిపోవడం, విద్యుత్, తాగు నీటి సమస్యలు అనేక ఉత్పన్నం అవుతున్నాయి. సమస్యల పరిష్కారం కోసం ఆయా డిపార్టుమెంట్ల కార్యాలయాల చుట్టూ దరఖాస్తులు పట్టుకొని తిరగాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. అంతేకాకుండా కాలనీలోని మెయిన్ డ్రెయినేజీలు చిన్నపాటి వర్షానికే నిండిపోవడంతో క్వార్టర్లలో నీళ్లు నిలిచి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఏపుగా పెరిగిన చెట్లతో సెప్టిక్ ట్యాంక్ కుండీలు పగిలి దుర్గంధం వెదజల్లుతోంది. వాహనాల పార్కింగ్, వీధి దీపాలు, పార్కులు, మైదానాల్లో ఎదురవుతున్న సమస్యలకు ఈ పాదయాత్రలే చక్కని పరిష్కార వేదిక అని, ప్రస్తుతం అవి లేకపోవడంతో సమస్యలు పరిష్కారంకాక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కార్మిక కుటుంబాలు వాపోతున్నాయి. అధికారులు పాదయాత్రలు చేపడితే వీటిని స్వయంగా పరిశీలించి యుద్ధప్రాతిపదికన సమస్య పరిష్కరించే అవకాశం ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు.

ఉన్న అవకాశం పోయింది

పాదయాత్రలు నిలిపివేసిన తర్వాత అధికారులు కొద్ది నెలలు ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం డయల్ యువర్ జీఎం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి నెల 1వ తేదిన ఉదయం 11 గంటలకు కార్మికులే నేరుగా జీఎంకు ఫోన్‌చేసి తమ సమస్యలను చెప్పుకునే వారు. దీంతో కొన్నయినా పరిష్కారం అయ్యేవి. ఇప్పుడు వాటిని కూడా నిలిపివేయడంతో ఉన్న ఒక్క అవకాశం కూడా పోయిందని కార్మికులు పేర్కొంటున్నారు. ఇటీవల గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిచిన ఏఐటీయూసీ నాయకులైనా ఈ కార్యక్రమాలను పునరుద్ధరణ చేస్తారో.. లేదో వేచిచూడాలి.

వెంటనే పునరుద్ధరించాలి

పాదయాత్రలు, డయల్ యువర్ జీఎం కార్యక్రమాలు లేకపోవడం వల్ల కార్మిక కుటుంబాలు చాలా ఇబ్బంది పడుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే వీటిని పునరుద్ధరించాలి. ఈ విషయమై సంస్థ యాజమాన్యాన్ని కలిసి విన్నవిస్తాం.

– ఎస్కే బాజీసైదా, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి

సింగరేణి సీఎండీగా ఎన్.బలరాం

- పలువురు నేతల అభినందనలు



బలరాంను అభినందిస్తున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణి సీఎండీగా డైరెక్టర్(పా, ఫైనాన్స్) ఎన్.బలరాంను నియమించారు. సీఎండీగా ఉన్న ఎన్.శ్రీధర్ పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ఐఆర్ఎస్ అధికారి అయిన కంపెనీలో డైరెక్టర్‌గా ఉన్న ఎన్.బలరాంకు సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కే.రాజీకుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య హైదరాబాద్‌లోని కంపెనీ కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బలరాంను కలిసిన జనక్‌ప్రసాద్

ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ కూడా బలరాంను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, కేంద్ర ఉపాధ్యక్షులు కలవేని శ్యాం, గరిగే స్వామి, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

టీబీజీకేఎస్ నాయకుల హర్షం

సింగరేణి సీఎండీగా బలరాం నియామకంపై టీబీజీకేఎస్ బ్రాంచి నాయకులు పెట్టం లక్ష్మణ్, బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, రత్నాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

కార్మికుల పక్షాన ఉంటాం



మాట్లాడుతున్న జెట్టి శంకర్‌రావు

శ్రీరాంపూర్: గెలుపోటములతో సంబంధం లేకుండా ఎప్పుడూ కార్మికుల పక్షానే ఉంటూ సేవ చేస్తామని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. మంగళవారం ఆయూనియన్ ఆధ్వర్యంలో ఆర్కే 5 గనిపై భరోసా యాత్ర పేరుతో కార్మికులను కలిసి మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు యాజమాన్యంతో చర్చిస్తూ పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, గరిగే స్వామి, నాయకులు ఆకుల రాజన్న, మహేందర్‌రెడ్డి, నీలం సదయ్య, భీం రవి, నర్సింగ్, సమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భైరవస్వామి జయంత్యుత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



కొండపై వెలిసిన భైరవస్వామి

కోటపల్లి: గోదావరి పరీవాహక ప్రాంతం.. ఆకాశాన్ని తాకుతున్నట్లు కనిపించే గుట్టలు.. ప్రకృతి అందాల నడుమ వెలసిన భైరవస్వామి భక్తులకు దర్శనమిస్తున్నాడు. కోటపల్లి మండలం పార్‌పల్లి గ్రామంలోని కొండపై కొలువుదీరిన భైరవస్వామి జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరిసర గ్రామాల ప్రజలు ముందుగా స్వామివారిని దర్శించుకున్న తర్వాతనే తమ ఇళ్లలో శుభకార్యాలు ప్రారంభిస్తారు. ఈ నెల 4న భైరవజయంతి సందర్భంగా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఏటా భక్తుల రద్దీ పెరుగుతుండడంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు కోటపల్లితో పాటు చెన్నూర్, వేమనపల్లి, గోదావరిఖని, మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.

ఉత్సవ కార్యక్రమాలు ఇలా..

4న ఉదయం 9:30 గంటలకు స్వామివారి అభిషేకం, సిందూరం లేపనం, వస్త్రాలంకరణ, పుష్పార్చన, మంగళహారతి, నైవేద్యం సమర్పణ, మధ్యాహ్నం ఒంటిగంటకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం, 7:30 గంటలకు మంగళహారతి, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పండుగలా జరుపుకుంటాం



గ్రామంలోని ఏ ఇంట శుభకార్యం జరిగినా ముందుగా భైరవస్వామిని దర్శించుకుంటారు. ఏటా భైరవ స్వామి జయంతి వేడుకలను గ్రామస్తులంతా కలిసి పండుగలా జరుపుకుంటాం.

– రామకృష్ణ, గ్రామస్తుడు

కొండను అభివృద్ధి చేయాలి



భైరవ కొండను అభివృద్ధి చేసి పార్‌పల్లికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలి. వందల ఏళ్ల చరిత్ర కల్గిన భైరవ కొండను దేవాదాయశాఖ గుర్తించి పర్యాటకంగా తీర్చిదిద్దాలి. గుట్ట వద్ద ఆలయాన్ని నిర్మించి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– రాజేశ్, భక్తుడు

హత్య కేసులో నిందితుల రిమాండ్

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఎర్రగుంటపల్లికి చెందిన ఆకుదారి సంపత్ హత్య కేసులో నిందితులు పంది మహేష్, వీరబోయిన సతీష్, అలుగునూరి అరుణ్‌కుమార్‌లను మంగళవారం జైపూర్ ఏసీపీ మోహన్ అరెస్టు చేశారు. చెన్నూర్‌లోని కోర్టులో జడ్జి ఎదుట నిందితులను ప్రవేశపెట్టగా రిమాండ్ విధించినట్లు చెన్నూర్ పట్టణ సీఐ వాసుదేవరావు తెలిపారు.

సీఎస్ఎల్ పోస్టుల భర్తీ ఎప్పుడో?

- నోటిఫికేషన్ వేసి నెలలు గడుస్తున్నా ఎంపికలో జాప్యం
- కార్మికులకు తప్పని ఎదురుచూపులు



కార్మికులు (ఫైల్)

కాసిపేట: మందమర్రి ఏరియాలో ఖాళీగా ఉన్న సీఎస్ఎల్(చార్జ్ సేఫ్టీ ల్యాంప్)పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నెలలు కావస్తున్నా నియామకాలు చేపట్టకపోవడంతో దరఖాస్తు చేసుకున్న కార్మికులకు ఎదురుచూపులు తప్పడంలేదు. మిగతా ఏరియాల్లో నియామకాలు పూర్తి చేసిన అధికారులు మందమర్రి ఏరియాను పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గనులపై ల్యాంప్ రూంలలో విధులు నిర్వహించేందుకు ఏరియాలో ఐదు పోస్టులు ఖాళీగా ఉండగా ఎనిమిది నెలల క్రితం యాజమాన్యం అంతర్గత నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో అర్హత ఉన్న 18 మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ పోస్టుకు జాతీయస్థాయిలో నిర్వహించే గ్యాస్ టెస్ట్(జీటీ)సర్టిఫికెట్ తప్పనిసరి. కానీ అంతకుముందు ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎక్కువ మందికి తెలియక దరఖాస్తు చేసుకోకపోవడంతో చేసిన వారికి అందరికి ఇచ్చారు. తిరిగి మళ్లీ నోటిఫికేషన్ వేయడంతో కార్మికుల నుంచి స్పందన వచ్చినా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

సర్దార్‌లు, ఓవర్‌మెన్‌ల దరఖాస్తులతో ఇబ్బందులు

సీఎస్ఎల్ పోస్టుకు సంబంధించి గ్యాస్ టెస్ట్ సర్టిఫికెట్ అవసరం. సర్దార్‌లు, ఓవర్‌మెన్‌లు, ఆపై స్థాయి అధికారులు మాత్రమే జీటీ సర్టిఫికెట్ కలిగి ఉంటారు. ఈ క్రమంలో నోటిఫికేషన్ వెలువడడంతో సర్టిఫికెట్ ఉన్న సర్దార్‌లు, ఓవర్‌మెన్‌లు సైతం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సూపర్‌వైజర్ స్థాయి అర్హత కలిగిన వీరికి ఆ పోస్టులు కేటాయిస్తే సంస్థకు నష్టం రావడంతో పాటు శిక్షణ అనుభవం ఉన్న సూపర్‌వైజర్ సేవలు దూరం అవుతాయని గమనించి వారి దరఖాస్తులు పరిగణలోకి తీసుకోకుండా ప్రయత్నాలు చేశారు. దానికి తోడు గ్యాస్ టెస్టింగ్ పరీక్షకు కొందరు సిద్ధంకావడంతో నాయకుల ఒత్తిడితో కాలంగడుపుతూ వచ్చారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం పరీక్ష ముగియడంతో మళ్లీ నోటిఫికేషన్ వేసేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. ఈక్రమంలో మొదట దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమకు అన్యాయం జరుగుతుందని, మళ్లీ నోటిఫికేషన్ వేయకుండా పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయాలని కోరుతున్నారు. పరీక్ష నిర్వహణకు హాల్‌టికెట్లు సైతం సిద్ధం చేసి తేదీ ఖరారు చేయాల్సి ఉండగా అధికారులు జాప్యం చేస్తూ వచ్చారని, వెంటనే నియామకాలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. ఈ విషయమై పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్‌ను వివరణ కోరగా సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో ఆలస్యం కావడంతో హాల్‌టికెట్లు జారీ చేయలేదన్నారు. పాలసీ మ్యాటర్ అయినందున కార్పొరేట్‌కు పంపించామని, త్వరలోనే పోస్టులకు సంబంధించి కార్మికులకు పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


సీఎంను కలిసిన సీపీఐ నాయకులు



సీఎంతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంగళవారం సీపీఐ నాయకులు సచివాలయంలో కలిసి అసంఘటిత రంగాల కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎంను కలిసిన వారిలో సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 32వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ నీలి కృష్ణ, 28వ వార్డు కౌన్సిలర్ కేంశెట్టి సరిత భర్త శ్రీనివాస్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడానికి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో గడ్డం అశోక్ కూడా ఉన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్‌పై అవిశ్వాసం ప్రకటించిన నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు మొదలయ్యాయి.

ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల స్వీకరణ

- కలెక్టర్ బి.సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని కలెక్టర్ బి.సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీసీఈవో నరేందర్, బెల్లంపల్లి, ఆర్డీవో హరికృష్ణ, చెన్నూర్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ సిడాం దత్తులతో కలిసి ప్రత్యేక అధికారులతో కార్యక్రమ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6 వరకు ప్రతీరోజు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికి దరఖాస్తులు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డివిజన్ పంచాయతీ అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు కృషి

- ఏసీపీ వెంకటేశ్వర్లు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

మంచిర్యాలక్రైం: బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని ఆపరేషన్ స్మైల్ ఇన్‌చార్జి, ఏసీపీ చిలుకూరి వెంకటేశ్వర్లు అన్నారు. ప్రభుత్వం బాల కార్మిక నిర్మూలన కోసం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆవరణలో జిల్లా పోలీస్ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదని, దాన్ని అనుభవించడం ప్రతీ పౌరుని హక్కు అన్నారు. కొందరు వ్యాపారులు బాలకార్మికులతో పనులు చేయిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 1 నుంచి 31వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆపరేషన్ స్మైల్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'సావిత్రిబాయి పూలేకు భారతరత్న ప్రకటించాలి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: సావిత్రిబాయి పూలేకు భారతరత్న అవార్డు ప్రకటించాలని కోరుతూ బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మంగళవారం అడిషనల్ కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు చదువు నేర్పించడంలో ఆమె ఎన్నో ఆటుపోట్లు, అవమానాలు ఎదుర్కొందన్నారు. సమాజానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీపతి రాములు, ఆరెందుల రాజేశం, అంకం సతీశ్, మిట్టపల్లి రాజశేఖర్, ముదుసు అనిల్, తదితరులు పాల్గొన్నారు.